

పర్యాటక ప్రాంతాలను తిలకించిన కర్ణాటక హైకోర్టు జడ్జి

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి జిల్లా ఏజెన్సీ అందాలు అద్భుతమని కర్ణాటక హైకోర్టు జడ్జి రామ్ నాథ్ హెగ్డే కొనియాడారు. ప్రముఖ పర్యాటక కేంద్రాలను తిలకించేందుకు రెండు రోజులలో అల్లూరి ఏజెన్సీలో సందర్శించిన బిజీ బిజీ గా గడపారు. గురువారం అనంతగిరి మండలం కాశీపట్నం పంచాయతీ కేంద్రంలో ఉన్న శివాలయాన్ని కుటుంబ సమేతంగా తిలకించారు. ఏజెన్సీ ప్రాంతాల అందాల అద్భుతలను వీక్షిందుకు గురువారం సందర్శించారు. జిల్లా కేంద్రం నుండి తిరుగు ప్రయాణంలో ముందుగా కాశీపట్నం గ్రామంలో వెలిసిన శివాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం విజయనగరం జిల్లా తాటిపూడి జలశయాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో అరకులోయ సివిల్ జార్జి కోర్టు సిబ్బంది, స్థానిక తహశీల్దార్ వీరభద్ర చారి. పాల్గొన్నారు.



ఆలయం వద్ద కూర్చున్న జడ్జి

సిపిఎం నేత అప్పలరాజుపై పీడీ యాక్టు దారుణం

›› తక్షణమే విడుదల చేయాలి ›› ఆ పార్టీ నేతల డిమాండ్

ప్రజాశక్తి -పాడేరు: రైతు నాయకులు, సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు యం.అప్పలరాజు పై అక్రమంగా బనాయించిన పిడి చట్టం కేసును వెంటనే ఉపసంహరించాలని, ఆయనను వెంటనే విడుదల చేయాలని సిపిఎం అల్లూరి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.అప్పలనర్స డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, ఉమ్మడి విశాఖపట్నం, ప్రస్తుతం అనకాపల్లి జిల్లాలో ప్రజల సమస్యలపై నిరంతరం పనిచేస్తున్న ఆయనను చట్టవిరుద్ధంగా నిర్బంధించడాన్ని తీవ్రంగా ఖండించారు. ఫార్మా కార్పొరేట్లకు కొమ్ముగాసి, వారిని సంతృప్తిపర్చడానికి రాష్ట్ర ప్రభుత్వం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతోందని విమర్శించారు. ఏనాడో ఉమ్మడి రాష్ట్రంలో 2013 మే నెలలో నమోదైన వాటి మొదలు తాజాగా రాజయ్యపేట బల్క్ డ్రగ్ పార్క్ కేసు ఈనెల 10 వరకు మొత్తం 19 కేసుల్లో ప్రభుత్వం అప్పలరాజును నిందితునిగా పేర్కొందన్నారు. ఆ 19 కేసుల్లో రెండింటిలో కోర్టులు నిర్దోషిగా తేల్చగా 12 కేసులు మూసివేయ బడ్డాయన్నారు. ఒకకేసు సివిల్ వివాదంగా ఖరారు చేయగా మరో నాలుగు కేసులు దర్యాప్తులో ఉన్నాయని పేర్కొన్నారు. ఇందులో 151 సెక్షన్ కేసులే ఎక్కువన్నారు. కాబట్టి అప్పలరాజును నిర్బంధించాలన్న దుర్బుద్ధితో నమోదు చేసిన అక్రమ పిడి చట్టం కేసు అని స్పష్టంగా అర్ధమవుతోందని విమర్శించారు. ప్రజల ప్రయోజనాలు, ముఖ్యంగా భూములు కోల్పోతున్న పేద రైతులు, అందునా అసైన్డ్ భూములు సాగుచేస్తున్న దళిత, గిరిజన బలహీనవర్గాల వారికోసం, అలాగే వృత్తి, ఉపాధి కోల్పోయే వ్యవసాయ కార్మికులు, మత్స్యకారులు, ఇతర వృత్తిదార్ల ప్రయోజనాలు కాపాడడానికి అప్పలరాజు ఉద్యమాల్లో పాల్గొంటున్నారన్నారు. వాటికి నాయకత్వం వహిస్తున్నారే తప్ప స్వంత ప్రయోజనాల కోసం కాదన్నారు. ప్రజల, ప్రభుత్వ ఆస్థుల్ని కాపాడే ధ్యేయంతో ప్రజల్ని కదిలించి ఉద్యమాలు నడుపుతున్నందుకే ప్రభుత్వం ఆయనపై కక్ష కట్టిందన్నారు. పిడి చట్టం నోటీసులో పేర్కొన్నట్టు అప్పలరాజు భూకబ్జాదారుకాదని. కార్పొరేట్ల లాభాల కోసం సముద్రతీరాన్ని, పర్యావరణాన్ని విషతుల్యం చేస్తున్న ప్రయత్నాలను ఎండగట్టి రాజ్యాంగం, చట్ట ప్రకారం ప్రభుత్వం వ్యవహరించాలని ప్రజలను సమీకరిస్తున్నారే తప్ప ఆయన ఏ రకంగాను ఎవరిపైనా గూండా గిరి చేయలేదన్నారు. ఈ కేసులు పరిశీలిస్తే ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్, ఆ తరువాత టిడిపి, వైసిపి, ఇప్పుడు టిడిపి కూటమి ఇలా ఏ పార్టీ అధికారంలో ఉన్నా అప్పలరాజు స్థానిక ప్రాజెక్టు బాధితుల పక్షాన నిలబడ్డారన్నారు. పాలన చేస్తున్నవారు కార్పొరేట్ సేవలోనే తరిస్తున్నారని విదితమవుతుందని. గంజాయి, ఎర్రచందనం, హ్యూమన్ ట్రాఫికింగ్ చేసేవారిని వదిలి నిజాయితీతో నిస్వార్థంగా ప్రజల కోసం పోరాడుతున్న అప్పలరాజుపై పిడి చట్టం ప్రయోగించడం ప్రభుత్వ నైజాన్ని తెలియ జేస్తుందన్నారు. విశాఖలో సిఐటియు అఖిలభారత మహాసభలు జరుగుతున్న నేపథ్యంలో ఈ అరెస్టు చేయడం దాన్ని మరింత రుజువు చేస్తుందన్నారు. తాజాగా సుప్రీం కోర్టు తెలంగాణాలో చట్ట విరుద్ధంగా పిడి యాక్టు అనేకమందిపై ప్రయోగించడాన్ని తప్పు బట్టిందని ప్రభుత్వం గుర్తించాలన్నారు. ఇటీవల కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రి భూసేకరణకు అడ్డుపడే వారిపై పిడి యాక్టు ప్రయోగించమని ఆర్డరు జారీ చేశారని, ఆ స్ఫూర్తితోనే కలెక్టర్ కనీసం ఆయనపై ఇప్పటి వరకున్న నేర చరిత్రను కూడా చదవకుండానే సంతకం పెట్టి ఆర్డర్ జారీ చేసినట్లు కనిపిస్తుందని, ప్రజల కోసం పనిచేస్తున్న అప్పలరాజుపై చట్ట విరుద్ధంగా బనాయించిన అక్రమ పిడి చట్టం కేసును ఉపసంహరించి, వెంటనే విడుదల చేయాలన్నారు.. ప్రజాతంత్రవాదులు, వామపక్ష, లౌకిక పార్టీలు, సంఘాలు ప్రభుత్వ చర్యను ఖండించాలని, పిడి యాక్టు కేసును ఉప సంహరించేలా ఒత్తిడి చేయాలని విజ్ఞప్తి చేశారు.



మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సురేంద్ర

డుంబ్రిగుడ: గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయాలు చేస్తున్న వారిపై పీడీ యాక్ట్ కేసులు పెట్టాలి తప్పా! ప్రజా ఉద్యమ నాయకులపై తప్పుడు పీడీ యాక్ట్ కేసులు నమోదు చేసి జైలుకు పంపడాన్ని సిపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కిల్లో సురేంద్ర తీవ్రంగా ఖండించారు. తక్షణమే పెట్టిన తప్పుడు కేసులు రద్దు చేసి భేసురత్తుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్క్ పరిశ్రమకు వ్యతిరేకంగా గత ఐదు నెలల నుండి మత్స్య కారులు అందోళన చేస్తున్నారని, వారికి మద్దతు ఇచ్చినందుకు అప్పలరాజుపై ఇంతటి క్రూరమైన కేసులను పోలీసులు పెట్టారని అగ్రహం వ్యక్తం చేశారు. అదికారంలోకి రాక ముందు బల్క్ డ్రగ్ పరిశ్రమకు వ్యతిరేకంగా మాట్లాడిన తెలుగుదేశం కూటమి నాయకులు అధికారంలోకి వచ్చిన తర్వాత మత్స్య కారులకు తీవ్రమైన ద్రోహం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటువంటి తప్పుడు కేసులు పెట్టి మత్స్యకారుల ఉద్యమాన్ని ఆపలేరని సిపిఎం నాయకులు పీడీ యాక్ట్ కేసులకు బెదిరింపులకు భయపడేది లేదన్నారు. పెట్టిన అక్రమ కేసులు రద్దు చేయకపోతే తెలుగుదేశం కూటమి ప్రభుత్వం తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. పోలీసులు అప్పలరాజు పై పెట్టిన తప్పుడు కేసులన్నీ రద్దు చేసి,భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎస్ బి పోతారాజు, పీ.సత్యనారాయణ, పి.శ్రీను పీ మోహన్ దాస్ తదితరులు పాల్గొన్నారు.

బిల్లులు చెల్లించక నిలిచిన నిర్మాణం

- అర్థాంతరంగా ఆగిన వంతెన, రహదారి పనులు
- రాకపోకలకు 30 గ్రామాల గిరిజనం ఇక్కట్లు

ప్రజాశక్తి -సీలేరు: చేసిన పనులకు సకాలంలో, సక్రమంగా బిల్లులు చెల్లించకపోవడంతో వంతెన, అప్రోచ్ రోడ్డు పనులు అర్థాంతరంగా నిలిచిపోవడంతో రాకపోకలకు 30గిరిజన గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు. ప్రభుత్వం, జిల్లా కలెక్టర్ వెంటనే స్పందించి, బిల్లులు చెల్లింపునకు చర్యలు చేపట్టి, వంతెన, రోడ్డు నిర్మాణాలను పూర్తిచేయించి, రాకపోకల కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

జీకే వీధి మండలం గుమ్మిరేవుల పంచాయతీ మాదిమల్లు వద్ద గత ఏడాది భారీ వర్షాలకు వంతెన రహదారి కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. దీంతో 30గ్రామాల గిరిజనుల రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడగా, అధికారులు స్పందించి, కొట్టుకుపోయిన వంతెన వద్ద మట్టితో . తాత్కాలికంగా డైవర్షన్ రోడ్డును నిర్మించి రాకపోకలను పునరుద్ధరించారు. అయితే మట్టి డైవర్షన్ కావడంతో ఏమాత్రం చిన్నవర్షం కురిసినా బురదమయమై ఇక్కట్లు పడే పరిస్థితి నెలకొంది. గుమ్మిరేవుల, దారకొండ పంచాయతీ పరిధిలోని 30 గ్రామాలు ప్రజల రాకపోకలకు ఇదే ప్రధాన మార్గం కావడంతో ప్రజల కష్టాలను గుమ్మిరేవులు సర్పంచ్ మురళి కమలమ్మ జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్, ఐటిడిఎ పిఒ, ఆర్అండ్‌బి అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వారు వెంటనే స్పందించి, సమస్యను రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వం స్పందించి, వంతెనతోపాటు ఇరువైపులా అప్రోచ్ రోడ్డు నిర్మాణానికి రూ.1.80కోట్ల నిధులు మంజూరు చేశారు. కాంట్రాక్టర్ లింగరాజుకు పనులు అప్పగించారు. కాంట్రాక్టర్ పనులు ప్రారంభించి ఏడు నెలల్లోనే వంతెన నిర్మాణ పనులు పూర్తి చేశారు. అయితే చేపట్టిన పనులకు రూ.32లక్షల బిల్లులు ప్రభుత్వం చెల్లించక పోవడంతో, సంబంధిత కాంట్రాక్టర్ పనులను నిలుపుదల చేశారు. దీంతో గుమ్మిరేవుల సర్పంచ్ కమలమ్మ పంచాయతీ పరిధి గ్రామాల గిరిజనులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోతే సదర కాంట్రాక్టర్ పనులు ఎలా చేయగలరని ప్రశ్నిస్తున్నారు. రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అత్యవసర పరిస్థితుల్లో వైద్యం, ఇతర అవసరాలతోపాటు నిత్యం రాకపోకలకు జనం ఇబ్బందులు పడుతున్నారు. వర్షాల సీజన్ ముగిసిపోవడంతో ఇపుడు పనులు చేపట్టేందుకు అవకాశం ఉన్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలి. రానున్న వేసవిలోగా వంతెన, రహదారి నిర్మాణాలను పూర్తి చేసివినియోగంలోకి తెచ్చే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి కాంట్రాక్టర్‌కు బిల్లులు చెల్లించి ,పనులు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



మాది మల్లు వద్ద అసంపూర్తిగా ఆగిపోయిన వంతెన నిర్మాణం

బిల్లులు చెల్లించి పనులు పూర్తి చేయించండి



చేసిన వంతెన, రోడ్డు పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కు వెంటనే బిల్లు బకాయిలు చెల్లించి పనులు ప్రారంభించేలా చర్యలు చేపట్టాలి. రోడ్డు, వంతెన సౌకర్యం లేకపోవడంతో గుమ్మరేవుల, ధారకొండ పంచాయతీల పరిధిలోని 30 గ్రామాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు.వెంటనే పనులు పునరుద్ధరించి పూర్తిచేయాలి

- మురళి కమలమ్మ, సర్పంచ్ గుమ్మరేవుల పంచాయతీ

సిపిఎం నేత అప్పారావు మృతికి సంతాపం

ప్రజాశక్తి-విఆర్ పురం: మండలంలోని ములకనపల్లి గ్రామపంచాయితీ బంగారుగూడెం గ్రామానికి చెందిన సిపిఎం సీనియర్ నాయకుడు సున్నం.అప్పారావు మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న అప్పారావు బుధవారం సాయంత్రం భద్రాచలం కిమ్స్ ఆసుపత్రిలో మృతి చెందగా, ఆయన పార్థివదేహాన్ని స్వగ్రామం బండారుగూడెం గ్రామానికి తీసుకొచ్చారు. విషయం తెలుసుకున్న సిపిఎం జిల్లా కార్యదర్శివర్గసభ్యులు సున్నం రాజులు, జిల్లా నాయకులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్‌కుమార్, స్థానిక సర్పంచ్ సవల మారయ్య, నాయకులు బంగారు ప్రసాద్, గ్రామ ప్రజలు తదితరులు గురువారం అప్పారావు మృతదేహాన్ని సందర్శించారు. పార్థీవదేహంపై పార్టీ పతకాన్ని కప్పి నివాళులర్పించారు. అప్పారావు భార్య జయమ్మ, కుమార్తె శ్రావణి, ఇతర కుటుంబసభ్యులను ఓదార్చి, పరామర్శించి సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు మాట్లాడుతూ ప్రజాసమస్యలపై పోరాటాల్లో అప్పారావు ఎపుడూ ముందుండేవారని, అటువంటి వ్యక్తి మరణం తీరనిలోటన్నారు.



అప్పారావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న నేతలు

బైక్‌ను ఢీకొట్టిన ప్రైవేటు బస్సు

రోడ్డు ప్రమాదంలో దంపతుల దుర్మరణం

మృతుడు చెరకుంపాలెం గ్రామ అగ్రికల్చర్ అసిస్టెంట్




కట్రం నవీన్‌కుమార్, బేబీ కల్యాణి దంపతులు (ఫైల్)

ప్రజాశక్తి-అడ్డతీగల :అడ్డతీగల మండలంలోని కొట్టంపాలెం గ్రామ సమీపంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగితోపాటు అతని భార్య దుర్మరణం పాలయ్యారు. వివరాలివి.

రాజవొమ్మంగి మండలం చెరుకుంపాలెం గ్రామ సచివాలయంలో అగ్రికల్చర్ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న కట్రం నవీన్‌కుమార్ బుధవారం సాయంత్రం తన విధులు ముగించుకుని భార్య బేబీ కల్యాణితోపాటు ద్విచక్ర వాహనంపై అడ్డతీగల మండలంలోని వేటమామిడి గ్రామంవద్ద తన స్నేహితుడు జరుపుకుంటున్న క్రిస్మస్ సంబరాలకు హాజరయ్యాడు. రాత్రి 11 గంటలకు దాటాక చెరుకుంపాలెం తిరిగొస్తుండగా, కొట్టంపాలెం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న అవంతి సీడ్స్‌కు చెందిన ప్రైవేట్ బస్సు బలంగా ఢీకొనడంతో నవీన్ కుమార్ అక్కడికక్కడేమృతి చెందాడు. ఇదే ప్రమాదంలో తీవ్రగాయాలైన నవీన్‌కుమార్ భార్య బేబీ కల్యాణిని అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ ఆరోగ్యం విషమించి మృత్యువాత పడింది .ప్రైవేట్ బస్సు డ్రైవర్ నిర్లక్ష్యంగా అతివేగంతో బస్సు నడపడం వల్లే ఈ ప్రమాదం సంభవించిందని ప్రత్యక్ష సాక్షుల అంటున్నాడు. మృతుడు నవీన్ కుమార్ స్వగ్రామం వై రామవరం మండలం ఎర్రంరెడ్డిపాలెం కాగా అతని భార్య కల్యాణి అదే మండలానికి చెందిన చింతకర్రపాలెం గ్రామం. ప్రమాదంలో దంపతుల దుర్మరణంతో రెండు గ్రామాల్లోనూ విషాదఛాయలు అలుముకున్నాయి.

సంఘటనపై అడ్డతీగల ఎస్ఐ వినోద్ ఆధ్వర్యంలోని పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం అడ్డతీగల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బిజెపి రాష్ట్ర కార్యదర్శి ఈరోజు స్వప్న కుమారి ద్వారా విషయం తెలుసుకున్న ఎస్‌టి కమిషన్ రాష్ట్ర చైర్మన్ చోళ బొజ్జిరెడ్డి హుటాహుటిన మృతులు నవీన్‌కుమార్ స్వగ్రామం ఎర్రంరెడ్డి పాలెం చేరుకొని బాధిత కుటుంబాలను ఓదార్చారు. తక్షణసాయంగా మట్టి ఖర్చులు నిమిత్తం రూ.25 వేలను అందజేశారు ప్రభుత్వ నుంచి రావాల్సిన సహాయ సహకారాలను వెంటనే అందేలా చూస్తానని హామీ ఇచ్చారు.



తక్షణసాయం అందిస్తున్న బొజ్జిరెడ్డి

ఆగి ఉన్న కారును ఢీకొట్టిన బైక్

ఇద్దరు పంచాయతీ కార్యదర్శుల మృత్యువాత

ప్రజాశక్తి-చింతూరు : రంపచోడవరం సమీపంలో ఐ పోలవరం వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పంచాయతీ కార్యదర్శులు దుర్మరణం పాలయ్యారు. పి.గన్నవరం మండలం కాట్రేనికోనకు చెందిన గడ్డం సందీప్ (30), కాట్రేనికోన మండలం పల్లంకుర్రుకు చెందిన ఇయ్యాల విద్యాసాగర్ (38) చింతూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా విధులు నిర్వహిస్తున్నారు. క్రిస్మస్ సెలవు కావడంతో తమ స్వగ్రామాలకు బైక్‌పై వెళుతుండగా పాలకాలువ దాటిన తర్వాత ఐ.పోలవరం వద్ద ఆగి ఉన్న కారును వీరు ప్రయాణిస్తున్న బైక్ ఢీకొట్టడంతో తీవ్రగాయల పాలయ్యారు. క్షతగాత్రులను రంపచోడవరం ఏరియా ఆసుపత్రికి తరలించగా, గడ్డం సందీప్ అక్కడ మృత్యువాత పడ్డారు. ఆరోగ్యం విషమంగా ఉన్న విద్యాసాగర్‌ను రాజమహేంద్రవరం తరలిస్తుండగా మార్గమధ్యలో తనువు చాలించాడు. మూడు నెలల క్రితమే వీరిద్దరూ ప్రమోషన్‌పై చింతూరు మండలంలో పంచాయతీ కార్యదర్శులుగా విధుల్లో చేరారు. గడ్డం సందీప్ ఏడుగురాళ్లపల్లి గ్రామ పంచాయతీ సెక్రటరీగా విధులు నిర్వర్తిస్తుండగా, విద్యాసాగర్ శీతనపల్లి పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. విధుల్లో చేరిన మూడు నెలల్లోనే స్థానిక ప్రజలతో మమేకమై సేవలు అందిస్తున్నారు. వీరిద్దరి మరణంతో వారి స్వగ్రామాల్లోనూ, పనిచేస్తున్న పంచాయతీల్లో విషాదఛాయలు అలుముకున్నారు.

గడ్డం సందీప్ మృతికి సంతాపంగా బొడ్డుగూడెం గ్రామ యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి, పంచాయతీలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి నివాళులర్పించారు. కొద్దిరోజుల క్రితం సందీప్ సేవలను మెచ్చిన బొద్దుగూడెం యువత ఆయనను ఘనంగా సన్మానించారు. ఆయన మృతి సందర్భంగా సందీప్ చేసిన సేవలను స్మరించుకున్నారు. బాధ్యతలు తీసుకున్న కొద్ది రోజుల్లోనే సేవా భావం, ప్రజలతో సత్సంబంధాలు, అభివృద్ధి కార్యక్రమాల పట్ల అంకితభావంతో గ్రామ ప్రజల్లో శాశ్వత స్థానాన్ని సంపాదించారు.





గడ్డం సందీప్, ఇయ్యాల విద్యాసాగర్ (ఫైల్‌ఫొటోలు)



అస్తవ్యస్తంగా ఉన్న రోడ్డుపై బోల్తా పడిన ట్రాక్టర్ (ఫైల్ ఫొటో)

అధ్వానంగా రహదారి

›› నిర్మించిన ఏడాదికే అస్తవ్యస్తం ›› ప్రమాదాల బారిన వాహనాలు
›› చోదకులకు తప్పని ఇక్కట్లు ›› గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పరిష్కారం కాని సమస్య

ప్రజాశక్తి-అరకులోయ రూరల్: అల్లూరి సీతారామ రాజు జిల్లా అరకులోయ మండలం సుంకరమెట్ట నుంచి కటికి వాటర్‌ఫాల్స్ వరకు సుమారు 8 కిలోమీటర్ల మేర రహదారి అధ్వానంగా ఉండటంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

ఈ రహదారిని 2018-19 సంవత్సరంలో నిర్మించగా అప్పట్లో ఏడాది తిరగక ముందే రహదారి పూర్తిగా దెబ్బతింది. మరమ్మత్తుల పేరుతో రోడ్డును గుంతలుగా తవ్వి నెలలు గడుస్తున్నా పనులు పూర్తి చేయక పోవడంతో ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఏ క్షణంలో ప్రమాదం జరుగుతుందోనన్న భయంతో వాహనాలు నడపాల్సిన పరిస్థితి నెలకొంది. ఇటీవల కేంద్ర ప్రభుత్వ పీఎం జన్‌మన్ పథకం కింద పివిటీజీ కుటుంబాలకు కేటాయించిన ఇళ్ల నిర్మాణానికి సంబంధించి కరకవలస గ్రామానికి వస్తున్న కంకర లోడ్ ట్రాక్టర్ ప్రమాదవశాత్తూ బోల్తా పడింది. రహదారి పరిస్థితి ఎంత ప్రమాదకరంగా ఉందో ఈ ఘటనతో తెలుస్తుంది.

సుంకరమెట్ట నుంచి కరకవలస వరకు రహదారి పూర్తిగా గుంతలమయంగా మారడంతో వర్షాలకు మరింత కోతకు గురవుతోంది. ఈ మార్గంలో సరుకులు తీసుకురావడానికి వాహనదారులు ముందుకు రావడం లేదని, కొందరు వచ్చినా కిరాయిలు అడుగుతున్నారు. తాజాగా జరిగిన ట్రాక్టర్ ప్రమాదం తర్వాత ఇకపై ఎవరూ వాహనాలు పంపేందుకు సిద్ధంగా లేరని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదే రహదారి మీదుగా కటికి వాటర్‌ఫాల్స్‌కు ప్రతిరోజూ వందలాది పర్యాటక వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. రహదారి అధ్వాన్న స్థితిలో ఉండటంతో అనేక మంది పర్యాటకులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు తెలిపారు. ఈ సమస్యపై గ్రీవెన్స్‌లో పలుమార్లు తెలిపినా పనులు పూర్తి చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. రెండు మూడు సార్లు వినతులు ఇచ్చినా రహదారి మరమ్మత్తులు మాత్రం పూర్తిగా జరగలేదని గ్రామస్తులు తెలిపారు.ఇప్పటికైనా సంబంధిత కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకొని, సుంకరమెట్ట నుంచి కటికి వాటర్‌ఫాల్స్ వరకు రహదారిని పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేసి ప్రజలకు సురక్షిత రాకపోకలు కల్పించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

ఘనంగా ధనుర్మాసోత్సవాలు

ప్రజాశక్తి -నక్కపల్లి: ఉపమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాసోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం శ్రీనివాసుడు అశ్వ వాహనంపై పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.శ్రీదేవి ,భూదేవి సమేత వెంకన్న ఉత్సవమూర్తులను అశ్వ వాహనం, గోదాదేవి అమ్మవారి ఉత్సవ మూర్తిని పల్లకీలోను అధిష్టింప చేసి మాడవీధుల్లో అర్చక బృందం ఆధ్వర్యంలో తిరువీధి సేవ నిర్వహించారు. స్వామివారిని భక్తులు దర్శించుకున్నారు. ఆలయంలో భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానార్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు పాల్గొన్నారు.

రేపు రంపచోడవరంలో జాబ్ మేళా

- ఐటిడిఎ పిఒ స్మరణ్‌రాజ్



ప్రజాశక్తి-రాజవొమ్మంగి: రంపచోడవరం యూత్ ట్రైనింగ్ సెంటర్లో (వైటిసి)వద్ద ఈనెల 27న జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి స్మరణ్‌రాజ్ తెలిపారు. జాబ్ మేళాలో వివిధ ప్రైవేట్ కంపెనీల ప్రతినిధులు పాల్గొని నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహించి తమ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపిక చేస్తారన్నారు. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.10వేలు నుండి రూ 20 వేల వరకు జీతం వచ్చే అవకాశం ఉందని, ఏజెన్సీలోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిఒ స్మరణరాజ్ సూచించారు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా జిల్లా కలెక్టర్ దినేష్‌కుమార్ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు తెలిపారు.

జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోండి

అడ్డతీగల : రంపచోడవరం వైటిసి వద్ద ఈనెల 27న శనివారం నిర్వహించే మెగా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడిఒ కుమార్ కోరారు. 18ఏళ్లు నిండి, ఐదో తరగతి నుంచి టెన్త్, ఇంటర్, డిగ్రీ, బిటెక్ ఇతర విదార్హతలకు కలిగిన నిరుద్యోగ యువతకు 1230 ఉద్యోగఖాళీల్లో నియామకాలు చేపడతారన్నారు. రాజమండ్రి, కాకినాడ, శ్రీసిటీ, చెన్నై, బెంగుళూరు, హైదరాబాద్, విశాఖ పట్నం తదితర నగరాల్లో ఉద్యోగాల నియమాకాలకు సంబంధిత కంపెనీల ప్రతినిధులు జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించి ఎంపికలు చేస్తారన్నారు. గ్రామాల్లోని నిరుద్యోగ యువతకు దీనిపై అవగాహన కల్పించి సద్వినియోగం చేసుకునేలా ప్రోత్సాహించాలని పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి సూచించారు.

ఘనంగా
ఫిడే రేటింగ్ ఓపెన్ చెస్ టోర్నీ ప్రారంభం



జ్యోతిప్రజ్వలనతో చెస్ టోర్నీ ప్రారంభిస్తున్న బాబూరావు, శ్రీకాంత్, తదితరులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ: నగరంలోని ఎంవీపీ ఎస్3 స్పోర్ట్స్ అరేనాలో అంతర్జాతీయ ఓపెన్ ఫిడే రేటింగ్ చెస్ టోర్నమెంట్-2025 గురువారం వైభవంగా ప్రారంభమైంది. శ్రీ చెస్ అకాడమీ, చైతన్య చెస్ అకాడమీ సంయుక్త ఆధ్వర్యంలో పోటీలను ఆంధ్ర విశాఖ చెస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ ఆర్. బాబూరావు, ఎస్3 స్పోర్ట్స్ ప్రతినిధి సహాని చీఫ్ ఆర్బిటర్ జివి.కుమార్ జ్యోతి ప్రజ్వలనతో అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీచెస్ అకాడమీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ టోర్నీలో దేశంలోని16 రాష్ట్రాలతో పాటు ఐదు విదేశాల నుండి మొత్తం 582 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారని . వీరిలో 250 మంది అంతర్జాతీయ ఫిడే రేటింగ్ కలిగిన క్రీడాకారులు ఉన్నారన్నారు . అనంతరం మొదటి ఆటను డాక్టర్ రంగాల బాబురావు సహాని ప్రారంభించగా, రెండో రౌండ్ పోటీలను ఎంవీఎస్ జ్యువలరీ రంగా ప్రారంభించారు. టాప్ సీడెడ్ క్రీడాకారులు ముందంజలో ఉన్నారు. ఈ నెల 28వరకు జరిగే ఈ పోటీలలో విజేతలకు రూ. 6 లక్షల నగదు బహుమతితో పాటు, ఆకర్షణీయమైన ట్రోఫీలు, సర్టిఫికెట్లు అందజేయనున్నారు. కార్యక్రమంలో చెస్ ఇన్ స్కూల్స్ మెంబర్ భీమారావు, ఏవీసీఏ సెక్రెటరీ ఎస్. మణికంఠ, శ్రీ చెస్ అకాడమీ డైరెక్టర్ వి. శ్రీకాంత్ పలువురు క్రీడాభిమానులు పాల్గొన్నారు.

డాక్టర్ వికాస్‌పాండేకు రాష్ట్రస్థాయి అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ వికాస్‌పాండే

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : వినియోగదారుల హక్కుల పరిరక్షణ, అవగాహన కార్యక్రమాలలో విశేష కృషి చేసిన నగరానికి చెందిన కన్స్యూమర్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వికాస్‌పాండేకు రాష్ట్ర ప్రభుత్వం అవార్డును ప్రదానం చేసింది.గురువారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జాతీయ వినియోగదారుల దినోత్సవంలో సివిల్ సప్లయిస్ డైరెక్టర్, ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ పాండే మాటాడుతూ భవిష్యత్తులో వినియోగదారుల అవగాహన, విద్య, పరిరక్షణకు మరింత సమర్థతతో,నిబద్ధతతో పనిచేస్తానన్నారు.

పొట్ట నింపని పగటి వేషాలు

సంక్రాంతి సంప్రదాయ కళాకారులకు కానరాని ప్రజాదరణ

తరతరాల వృత్తులు, కళలను ప్రోత్సహించాలని వినతి



శక్తి వేషాన్ని వింతగా చూస్తున్న చిన్నారులు

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: సంక్రాంతి వస్తుందంటే చాలు పల్లెల్లో కళారూపాలతో సందడి వాతావరణం నెలకొంటుంది. .పల్లెల్లో పగటివేషగాళ్ళు వివిధ కళారూపాలను ప్రదర్శించి ప్రజలను ఎంతగానో ఆకట్టుకుంటారు. ప్రజలు ఇచ్చిన కానుకలను తీసుకుని జీవనోపాధి గడుపుతుంటారు.

ప్రస్తుతం సంక్రాంతి దగ్గర పడుతుండటంతో ఏజెన్సీ గ్రామాల్లో పండగ సందడి మొదలైంది. గ్రామాల్లో హరిదాసులు, గంగిరెద్దులు, జంగం దేవరలు, ఇతర సాంప్రదాయ వృత్తుల వారు ఇంటింటికి తిరుగుతూ ప్రజల్లో ఉత్సాహం నింపుతుంటారు..ఈ నేపథ్యంలో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం గ్రామానికి చెందిన ఎడవల్లి లోవరాజు,నాగరాజులు పగటి వేషగాళ్లు మండలంలోని కొన్ని గ్రామాల్లో శక్తి వేషం, రాముడు, ఆంజనేయులు, కృష్ణుడు, జాంబవంతుడు, మహాశివుడు, భద్రకాళి వంటి పౌరాణిక వేషధారణలు వేసి ఇంటింటికి వెళ్లి కళారూపాల ప్రదర్శనతో విరాళాలు సేకరిస్తున్నారు. తమ తాత ముత్తాతల నుంచి ఇదే కులవృత్తిగా, జీవనాధారంగా జీవనం సాగిస్తున్నామని వారు తెలిపారు. నాడు ఈ కళకు పల్లెల్లో విశేష ఆదరణ ఉండేదని, నేడు ఎవరో కొందరు తప్ప, ఎక్కువ మంది తమను గుర్తించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడాదిలో కేవలం సంక్రాంతి సందర్భంగానే ఇలా ఇంటింటికీ వెళ్లి కానుకలను స్వీకరిస్తున్నామని అంటున్నారు. అయితే ఇపుడు రోజంతా కాళ్లరిగేలా తిరిగినా కనీసస్థాయిలోనైనా కానుకలు చేరడం లేదని వాపోతున్నారు. ప్రజల నుంచి నానాటికీ ఆదరణ కరువవుతున్న నేపథ్యంలో .ప్రభుత్వం తమ లాంటి సాంప్రదాయ కళాకారులను, కళలను ప్రోత్సహించి ఆదుకోవాలని కోరుతున్నారు. సంప్రదాయ కళలను బతికించుకోవాలన్నా, తాము బతకాలన్నా ప్రభుత్వం తమకు గౌరవ వేతనం ఇచ్చేలా చర్యలు చేపడితే బాగుంటుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.



అసంపూర్తిగా ఉన్న ఏకలవ్య పాఠశాల

ఏకలవ్య పాఠశాల భవనం పూర్తయ్యేదెన్నడో?

ప్రజాశక్తి-దుంబ్రిగుడ:మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల నూతన భవనాల పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇదిగో.. అదిగో అంటూ కాలయాపన చేస్తున్నారు తప్పా! ఇప్పటికి పూర్తి చేయలేదు. దీంతో ఆ పాఠశాలలో చదివే విద్యార్థులు ఇరుకు గదుల్లో విద్యనభ్యసిస్తూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడి పాఠశాల భవన నిర్మాణాలు ప్రారంభించిన తర్వాత నిర్మాణం చేపట్టిన ముంచంగిపుట్టు మండలంలోని ఏకలవ్య పాఠశాలను ప్రారంభించారు. కానీ స్థానిక మండల కేంద్రంలో నిర్మిస్తున్న ఏకలవ్య పాఠశాల ఇప్పటికీ ప్రారంభించక పోవడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ పాఠశాల భవన నిర్మాణాలను గత 2019లో ప్రారంభించారు. అప్పటినుంచి ఇప్పటివరకు సుమారు 6 ఏళ్ళు గడుస్తున్న ఇప్పటికి పూర్తి కాలేదు. ఉన్నతాధికారులు సందర్శించి వెంటనే నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని ఆదేశిస్తున్నప్పటికీ ఇక్కడి నిర్మాణ పనులు మాత్రం నత్త నడకన సాగుతున్నాయి. గత ఆగస్టు నెలలో నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రారంభించాలని అధికారులు చెప్పినప్పటికీ పనులు ముందుకు సాగలేదు. ఇక్కడ నిర్మాణ పనులు పూర్తికాక అరకులోయలో నిర్వహణ కొనసాగిస్తున్నారని, అక్కడ విద్యార్థులకు సరిపడే పూర్తిస్థాయిలో భవన సౌకర్యాలు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పలువురు విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండ ప్రాంతం కావడంతో తప్పనిసరిగా ప్రహరీ గోడ సౌకర్యం ఉండాలి. ప్రహరీ నిర్మాణంలో ఆలస్యం జరుగుతోంది. తక్షణమే సంబంధిత ఉన్నత స్థాయి అధికారులు స్పందించి భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేసి ప్రారంభించాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వంజంగిలో పర్యాటకుల సందడి



వంజంగి కొండపై పర్యాటకులు

ప్రజాశక్తి-పాడేరు టౌన్: పాడేరు మండలంలోని వంజంగి మేఘాల కొండ వద్ద గురువారం పర్యాటకులతో కిటకిటలాడింది. ఆయా రాష్ట్రాలకు చెందిన పర్యాటకులు పాడేరుకు ముందుగా చేసుకున్నారు. కుటుంబ సభ్యులతో వచ్చిన వారంతా పాడేరులోని లాడ్జిల్లో రాత్రి బస చేసి గురువారం వేకువ జామును వంజంగి మేఘాల కొండకు తరలి వచ్చారు. మరి కొందరు పర్యాటకులు నేరుగా వంజంగి ప్రాంతానికి చేరుకుని రిసార్ట్స్‌లో క్యాంప్ ఫైర్; గిరిజన సాంప్రదాయ థింసా నృత్యాలు సాంస్కృతిక కార్యక్రమాలతో ఆనందంగా గడిపారు. గత వారం రోజులుగా చలి తీవ్రత, మంచు అధికంగా ఉండటంతో పర్యాటకులు ప్రకృతి అందాలను తిలకిస్తూ పరవశించి పోయారు. మేఘాల కొండపై పాల సముద్రాన్ని తలపించే మంచు మేఘాలు, సూర్యోదయం వేళ మంచును చీల్చుకుని వచ్చి భానుడి కిరణాలు పర్యాటకుల మదిని దోచేస్తున్నాయి.

టిడిపి పార్లమెంట్ ప్రతినిధుల నియామకం




ఉపాధ్యక్షులు అప్పారావు, రవీంద్ర

ప్రజాశక్తి - అనంతగిరి: మండలంలో తెదేపా పార్టీ పార్లమెంట్ ప్రతినిధులను అధిష్టానం నియమించింది. అరకు పార్లమెంట్ ఉపాధ్యక్షులుగా జన్ని అప్పారావు, పాంగి రవీంద్రలను నియమించింది. అలాగే అరకు పార్లమెంట్ జిల్లా అధికార ప్రతినిధులుగా పాంగి. రాధిక, ప్రస్తుతం సర్పంచ్‌గా కొనసాగుతున్న గెమెల బీమలమ్మలకు అధిష్టానం అవకాశం కల్పించింది. ఈ సందర్భంగా ఎన్నికైన సభ్యులు మాట్లాడుతూ, అధిష్టానం తమకు అప్పగించిన బాధ్యతలను, ప్రభుత్వ పథకాలను ప్రజలను అందే విధంగా తాము కృషి చేస్తామని వారు తెలిపారు. పార్టీ అధిష్టాన పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు.

విద్యుదాఘాతంతో వాచ్‌మ్యాన్ మృతి

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక కీటిన్‌పేటకు చెందిన సమ్మిడి గడ్డప్ప (63) ప్రమాదవశాత్తూ బుధవారం రాత్రి విద్యుదాఘాతానికి గురై మృతి చెందాడు. ఎస్ఐ లలిత్ ఆదిత్య కథనం ప్రకారం... ప్రైవేట్ లే-అవుట్‌లో వాచ్‌మ్యాన్‌గా పని చేస్తున్న గడ్డప్ప ఎప్పటి లాగానే బుధవారం సాయంత్రం 5గంటలకు డ్యూటీకి వెళ్లాడు. మృతుని కుటుంబీకుడు ఎం.సురేష్‌కుమార్ రాత్రి 7 గంటలకు భోజనం తీసుకెళ్లాడు. ఆ సమయంలో గడ్డప్ప అపస్మారక స్థితిలో ఉండడాన్ని చూసి చుట్టు పక్కల వారి సాయం తీసుకుని 108లో ఆసుపత్రికి తీసుకెళ్లారు. అప్పటికే అతను మృతి చెందాడు. మృతుని కుమారుడు ప్రదీప్ ఫిర్యాదు మేరకు ఎస్ఐ లలిత్ ఆదిత్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు

సెప్టిక్ ట్యాంక్‌లో పడి బాలిక మృతి

ప్రజాశక్తి - ఆనందపురం : ఆడుకుంటూ ప్రమాదవశాత్తు సెప్టిక్ ట్యాంక్‌లో పడి మూడేళ్ల బాలిక మృతి చెందిన విషాద ఘటన ఆనందపురం మండలం ముచ్చర్ల గ్రామం వైఎస్ఆర్ కాలనీలో గురువారం చోటుచేసుకుంది. ముచ్చర్ల గ్రామానికి చెందిన లంక గణేష్, జగదీశ్వరి దంపతులకు మూడేళ్ల కుమార్తె ఢిల్లీశ్వరి, ఏడాదిన్నర వయస్సున్న కుమారుడు చాణుక్య ఉన్నారు. గురువారం మధ్యాహ్నం సుమారు 2 గంటల సమయంలో ఢిల్లీశ్వరి ఇంటి సమీపంలో ఆడుకుంటుండగా ముళ్లపొదల మధ్యలో ఉన్న సెప్టిక్ ట్యాంక్‌లో కాలుజారి పడిపోయింది. బాలిక కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు పరిసరాల్లో వెతికారు. సెప్టిక్ ట్యాంక్‌లో నీటిలో తేలియాడుతూ ఢిల్లీశ్వరి కనిపించింది. బాలికను పైకి తీసి తగరపువలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరిశీలించి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. బాలిక తండ్రి గణేష్ అన్నయ్య లంక అప్పలరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆనందపురం సిఐ వాసునాయుడు ఆధ్వర్యాన ఎఎస్ఐ బాలం నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

వరి కుప్పలు దగ్ధం

ప్రజాశక్తి-చీడికాడ:మండలంలోని గిరిజన గ్రామమైన కొండంపూడిలో మూడు వరి కుప్పల దగ్ధం అయ్యాయి. సుమారు లక్ష రూపాయలు ఆస్తి నష్టం వాటినట్లు బాధితులు తెలిపారు. కొండంపూడి గ్రామానికి చెందిన చలుము పెంటయ్య, చల్మో దేవుడులకు చెందిన వరి చేనును కళ్ళంలో కుప్పలుగా వేశారు. పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం నుండి విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కాగా నిప్పులు చెలరేగి వరి కుప్పలు దగ్ధమయ్యాయి. విషయం తెలుసుకున్న మాడుగుల అగ్నిమాపక కేంద్రం సిబ్బంది మంటలను అదుపు చేశారు. ఈ విషయం తెలుసుకున్న టిడిపి నేత వంటాకు కుమార్ నాయుడు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను పరామర్శించారు. ప్రభుత్వపరంగా ఆర్థిక సహాయం అందేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు.

బైకులు ఢీకొని నలుగురికి గాయాలు

ప్రజాశక్తి: రావికమతం:రావికమతం మండలం టి.అర్జాపురం సమీపంలో రెండు బైకులు ఢీ కొనడంతో గురువారం నలుగురు గాయాల పాలయ్యారు. కాకినాడ జిల్లా ధర్మవరం గ్రామానికి చెందిన వాసు, వొమ్మంగి గ్రామానికి చెందిన షేక్ మీరా సాహెబ్ బైక్‌పై పాడేరు వెళుతున్నారు. మాడుగుల మండలం కె వల్లపురం గ్రామానికి చెందిన కోన జగ్గారావు పొంగలిపాక గ్రామానికి చెందిన శెట్టి నాయుడు బైకు పై నర్సీపట్నం వెళుతున్నారు. ఈ బైకులు ఎదురుగా ఢీ కొనడంతో నలుగురికి తీవ్రంగా గాయాలయ్యాయి. వీరిని నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

అదృశ్యమైన బాలిక కుటుంబీకుల చెంతకు..

ప్రజాశక్తి -ములగాడ : మల్కాపురం పోలీస్ స్టేషన్ పరిధిలో అదృశ్యమైన బాలికను సురక్షితంగా కుటుంబ సభ్యులకు మల్కాపురం పోలీసులు అప్పగించారు. ఘటనకు సంబంధించి పోలీసుల కథనం ప్రకారం... బాలిక తల్లిదండ్రులతో విభేదించి ఈనెల 18వ తేదీన ఇంటి నుండి అదృశ్యమైంది. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మల్కాపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బాలిక (16)ను ఒడిశా రాష్ట్రం రాయిరాంపూర్ ప్రాంతంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. మల్కాపురం పోలీసుల ప్రత్యేక బృందం ఒడిశా రాష్ట్రానికి వెళ్లి బాలికను సురక్షితంగా తీసుకొచ్చారు. విచారణ తరువాత బాలికను తల్లిదండ్రులకు అప్పగించారు. మల్కాపురం పోలీసుల తక్షణ స్పందన, సమన్వయంతో కూడిన దర్యాప్తు, సాంకేతిక పరిజ్ఞానంతో కొద్దిరోజులలోనే బాలిక ఆచూకీ కనిపెట్టినట్లు మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు తెలిపారు.

ఘనంగా క్రిస్మస్ సంబరాలు



వస్త్రాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిరీషాదేవి దంపతులు



సీలేరులో రగ్గులు పంపిణీ చేస్తున్న సిఆర్‌పిఎఫ్ కమాండెంట్ జాన్

సేవాభావాన్ని అలవర్చుకోవాలి

ప్రజాశక్తి-రాజవొమ్మంగి: సమాజంలో ప్రతి ఒక్కరూ సేవాభావాన్ని అలవర్చుకోవాలని రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి, తెలుగు యువత నియోజకవర్గ అధ్యక్షులు మఠం విజయభాస్కర్ అన్నారు. గురువారం తమ స్వగ్రామం అనంతగిరిలో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. ముందుగా తన కుటుంబసభ్యులతో కలిసి కొవ్వొత్తులు వెలిగించి కేకు కట్ చేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిరీషాదేవి మాట్లాడుతూ.తమ సొంతూరులో క్రిస్మస్ వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. ప్రేమ, శాంతి, సమాధానం, సేవాతత్పరత క్రీస్తు జీవితంలోని ఆచరణాత్మకమైన విధానాలని, ఆ బాటలో ప్రతిఒక్కరూ నడవాలని ఆకాంక్షించారు. అనంతరం సొంత డబ్బుతో పేదలు, వృద్ధులకు వస్త్రదానం చేశారు. కార్యక్రమంలో ఫాస్టర్లు రూతు, ఎం.ఝాన్సీ, మాజీ సర్పంచ్ మఠం డియసమ్మ, ఎఎంసీ డైరెక్టర్ శివ, గ్రామ పెద్దలు దూలి పురుషోత్తం, కె. ఆనందరావు పాల్గొన్నారు.

పాడేరు: అల్లూరి జిల్లా పాడేరు ఏజెన్సీలో క్రిస్మస్ పండుగ వేడుకలను క్రైస్తవ సోదరులు ఘనంగా జరుపుకున్నారు. చర్చిలను ముస్తాబు చేసుకొని క్రిస్మస్ ట్రీలు, స్టార్లతో ప్రత్యేకంగా అలంకరించుకున్నారు. చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేకంగా ప్రార్థనా కూటములు నిర్వహించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.పాడేరు పట్టణం లోని గుడివాడలో ఉన్న కారుణ్య ప్రార్ధన మందిరం, లోచలిపుట్టు సర్వోన్నథుడైన దేవుని మందిరంలో ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాస్టర్ సిహెచ్ దైవ కృప తిమోతి, ముఖ్య అతిథులుగా ప్రిన్సిపాల్ కొట్టగుల్లి సింహాచలం నాయుడు. కేక్ కటింగ్ చేశారు. చర్చి నిర్వాహకులు బి.ఎలీషారావు, జి.ఎస్. రాజు, మోద స్టీవెన్ శ్రీనివాస్, మనోహర్, రత్నకుమార్, రమేష్, వైద్య ఉద్యోగుల సంఘ అధ్యక్షులు ఎస్.నాగరాజు పాల్గొన్నారు.

సీలేరు: సీలేరులో శ్రీతీ నేతన్య యూసిఐఎం, గేస్తమనే, పెంతుకోస్తు, కల్వరి చర్చిలలో బుధవారం అర్ధరాత్రి క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. కేకులు కట్ చేసి, హ్యాపీ క్రిస్మస్ అంటూ పరస్పరం శుభాకాంక్షలు చెప్పుకుని క్రైస్తవులు సందడి చేశారు. ప్రత్యేక ప్రార్థనలలో పాల్గొన్నారు. చిన్నారులచే సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రార్థనా గీతాలు ఆలరించాయి. గేస్తమనే చర్చిలో సిఆర్‌పిఎఫ్ 42వ బెటాలియన్ కమాండెంట్ పాస్టర్ జాన్ మేసేజ్ ఆధ్వర్యంలో పేదలకు రగ్గులు పంపిణీ చేశారు. కుల మతాలకతీతంగా క్రిస్మస్ వేడుకలకు అతిథులను ఆహ్వానించి చర్చి ప్రాంగణంలో విందు ఏర్పాటు చేశారు. ఎపి జెన్‌కో ఎడిఇ కె.జైపాల్, కార్మికులు కాంట్రాక్ట్ కార్మికులు, సిఆర్‌పిఎఫ్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

క్రిస్మస్ వేడుకల్లో నేతలు

విఆర్ పురం: మండలంలోని సంతపాకల వద్ద ప్రార్థన మందిరంలో పాస్టర్ డేవిడ్ లివిస్టాన్, బిసి కాలనీ త్రియేక ప్రార్థన మందిరంలో పాస్టర్ యేసురత్నం ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు వైభవంగా జరిగాయి. క్రిస్మస్ వేడుకల్లో ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం. జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు సున్నం రాజులు, జిల్లా కమిటీ సభ్యులు సోయం చిన్నబాబు, మండల కార్యదర్శి పులి సంతోష్ కుమార్, మండల కార్యదర్శివర్గ సభ్యులు పంకు. సత్తిబాబు ఆధ్వర్యంలో సిపిఎం బృందం పాల్గొని కేకు కట్ చేశారు. క్రైస్తవులకు క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. రేఖపల్లి, రాజుపేట, రామవరం, పెద్దమట్టపల్లి, చింతరేగుపల్లి, సోములుగూడెం గ్రామంలో క్రిస్మస్ వేడుకల్లో మాట్లాడుతూ, ఏసుక్రీస్తు జీవితం అందరికీ ఆదర్శప్రాయ మన్నారు. ప్రజలందరూ సుఖశాంతులతో ఆయురారో గ్యాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. క్రిస్మస్ విందులో గ్రామస్తులు, క్రిస్టియన్లతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల నాయకులు కమ్మచిచ్చు సత్యనారాయణ, సిహెచ్ సుబ్బారావు, సీనియర్ నాయకులు వీర్ల నాగేశ్వరరావు, కార్యకర్తలు చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు



కేకు కట్ చేస్తున్న ఎంపిపి కారం లక్ష్మి, సిపిఎం నేతలు


జికె వీధి: మండలంలోని వంచుల పంచాయతీ అడగారపల్లి గ్రామంలో పాస్టర్ అరడ చిన్నబ్బాయి ఆధ్వర్యంలో క్రిస్మస్ పండగను ఘనంగా నిర్వహించారు. సువార్తికులు మధుకుమార్ క్రిస్మస్ విశిష్టతను వివరించారు. సంఘపెద్దలు లోతా గంగరాజు, సింహాచలం, బూడిద వెంకటరావు,మండలం కృష్ణ ఉన్నారు.

చింతపల్లి : చింతపల్లి మండలం కందులుగాదె గ్రామంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని యెహోవా ప్రార్థన మందిరంలో క్రైస్తవ బోధకుడు శోభన్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ముఖ్య అతిథిగా షారోన్ టీమ్ సభ్యుడు దురియ హేమంత్ హాజరై భక్తులకు సందేశం అందించారు. ఉదయం నుంచే స్తోత్ర గీతాలు, బైబిల్ పఠనాలు, ప్రత్యేక ప్రార్థనలతో ప్రార్థన మందిరం భక్తులతో కిటకిటలాడింది. పిల్లలు నిర్వహించిన ప్రత్యేక గీతాలు, నాటికలు విశేషంగా ఆకట్టుకున్నాయి. అనంతరం కేక్ కట్ చేశారు.

దుంబ్రిగుడ:మండలంలో క్రిస్మస్ వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. మండల వ్యాప్తంగా ప్రార్థన మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలతో పాటు గీతాపాలనలతో క్రైస్తవ సోదరి, సోదరులు పండుగను ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని నారింజవలస బెతెలు చర్చిలో పాస్టర్ సుదర్శన్, మండల కేంద్రం దుంబ్రిగుడలో సీయోను, యూసీఐఎం, షారోను ప్రార్ధన మందిరాల్లో పండుగను జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో క్రైస్తవులు తదితరులు పాల్గొన్నారు.



పాడేరులో కేకు కట్ చేస్తున్న ప్రిన్సిపల్ సింహాచలం



జికె.వీధిలో కానుకల పంపిణీ



చింతపల్లిలో క్రిస్టమస్ వేడుకల్లో పాల్గొన్న క్రిస్టియన్లు




దుంబ్రిగుడలో కేక్ కట్ చేస్తున్న దైవ సేవకులు

సిపిఐ నేత మంగరాజుకు ఘననివాళి

ప్రజాశక్తి-ఎటపాక : సీపీఐ నేత కందుకూరి మంగరాజు సేవలు మరువలేనివని ఆపార్టీ నాయకులు అన్నారు.. గురువారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో సిపిఐ మాజీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, కందుకూరి మంగరాజు వర్ధంతిని పురస్కరించుకుని ఆయన స్థూపం వద్ద నివాళు లర్పించారు. సీనియర్ నాయకులు వల్లభనేని సత్యనారాయణ పార్టీ జెండాను ఆవిష్కరించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడిన మంగరాజు, పోలవరం నిర్వాసితుల సమస్యలపై కడదాకా పోరాటం చేశారన్నారు. అటువంటి వ్యక్తి మన మధ్య లేకపోవడం పార్టీకి, వారి కుటుంబానికి తీరనిలోటన్నారు. పోలవరం నిర్వాసితులకు న్యాయం జరిగే వరకు, ప్రజాసమస్యలు పరిష్కారమయ్యే వరకు పోరాడడమే మంగరాజుకు ఇచ్చే ఘననివాళి అన్నారు కార్యక్రమంలో డివిజన్ సహాయ కార్యదర్శి వాసం రాము, ఎంపిటిసి కంటే రాజు, మండల కార్యదర్శి ఎలీషాల నాగరాజు, వల్లభనేని సత్యనారాయణ, వరదా బ్రహ్మం, కందుకూరి సూర్యనారాయణ, ముసునూరి వెంకన్నబాబు, ఏడిద సుబ్బారావు, పూస రాఘవులు, గద్దం వెంకటేశ్వర్లు, వెంకట రత్నం, సవలం శ్రీకాంత్, సాగర్ పాల్గొన్నారు.



మంగరాజు స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు